మరసం... సాహిత్య ప్రవాహం..

- మంజీర రచయితల సంఘానికి 38 ఏళ్లు
- సామాజిక ఉద్యమాలతో ప్రజాక్షేత్రంలోకి..
- తెలంగాణ పోరాటానికి వెన్నుదన్ను
- కవులు, గాయకులు, రచయితలను తీర్చిదిద్దిన ఘనత
- నేడు సిద్దిపేట విపంచి హాల్‌లో వార్షికోత్సవం
- హాజరవుతున్న ప్రముఖ కవులు, సాహితీవేత్తలు

"మంజీర రచయితల సంఘం మాది
కన్నీటి వ్యథలన్నీ కథలుగా సృజియించి
శ్రమశక్తి విజయాల కవితలై వెలయించు
చైతన్య సాగర తరంగం మాది"

..అంటూ సాహిత్య పరిమళాలను సామాజిక ఉద్యమాల కోసం వెదజల్లిన ఘనత మంజీర రచయితల సంఘానిది. 'మ.ర.సం'గా ఆవిర్భవించి మెతుకుసీమ తనువంతా స్పృశించి చైతన్యాన్ని రేకెత్తించిన సాహితీ సంస్థ ఇది. 1986లో పురుడుపోసుకొని 38 ఏళ్లపాటు ప్రజా ఉద్యమాలు, ప్రత్యేక పోరాటాలు, సామాజిక, విప్లవ భావజాల ప్రదర్శనలో మమేకమైన వేదిక ఇది. నేడు సిద్దిపేటలోని విపంచి టౌన్‌హాల్‌లో వార్షికోత్సవం జరుపుకుంటున్న నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, సెప్టెంబరు 28: ప్రజా ఉద్యమాలు, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం, విప్లవ రచయితల సంఘం ఇచ్చిన ప్రేరణతో కొంతమంది కవులు, రచయితలు ఏర్పాటు చేసుకున్న సంఘమే మరసం. ఉమ్మడి మెదక్ జిల్లాలో అభ్యుదయ భావాలు కలిగిన కవులందరినీ ఒక వేదిక మీదకు తెచ్చి సాహిత్యాన్ని సుసంపన్నం చేయాలనే సంకల్పంతోనే ఈ సంఘం ఆవిర్భవించింది. 1986లో మొట్టమొదటి మరసం సభ సిద్దిపేటలో జరిగింది. నాటి కార్యక్రమానికి సాహితీవేత్త, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి హాజరయ్యారు. అప్పటి నుంచి సాహిత్య మంజీరా ప్రవాహం ప్రారంభమైంది. మంజీరా నదికి ఏడుపాయలు ఉన్నట్లే మంజీర రచయితల సంఘానికీ ఉమ్మడి జిల్లాలో ఏడు శాఖలను ఏర్పాటు చేశారు.



మంజీర రచయితల సంఘం 10వ వార్షికోత్సవం సందర్భంగా సిద్ధిపేటలో కవులు, రచయితల ర్యాలీ (ఫైల్)

సామాజిక ఉద్యమాల్లో కీలకంగా..

నాడు ఉమ్మడి మెదక్ జిల్లాను పట్టిపీడించిన మద్యపానంపై 'మరసం' గ్రామగ్రామాన చైతన్యాన్ని నింపింది. రాత్రి సమయంలో నాటక ప్రదర్శనలు నిర్వహించి మద్యపానంతో జరిగే అనర్థాలను కళ్లకు కట్టారు. తాగుడుకు బానిసైనవారి కళ్లను తెరిపించే ప్రయత్నం చేసింది మరసం. కవులు, రచయితలే వేషాలు ధరించి సామాజిక రుగ్మతలను తరిమికొట్టడంలో భేష్ అనిపించుకున్నారు. వరకట్న వ్యతిరేక ప్రదర్శనలు, అమెరికా యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా, అశ్లీల సంస్కృతిని నిరసిస్తూ అనేక కార్యక్రమాలు చేపట్టారు. ప్రధానంగా రైతుల ఆత్మహత్యలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఆత్మహత్యలు చేసుకొని కుటుంబాలను ఆగం చేయవద్దంటూ నాటకాలతో కనువిప్పు కలిగించిన సంఘమే మరసం. గుట్కాలు, పాన్‌మసాలా వ్యసనాలకు వ్యతిరేకంగా కవితలు, పాటలతో ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేశారు.

స్వరాష్ట్ర పోరాటంలో...

"నాగేటి సాల్లల్ల నా తెలంగాణ.. నవ్వేటి బతుకుల్ల నా తెలంగాణ" అనే పాటతో స్వరాష్ట్ర ఉద్యమానికి ఊపిరిపోసిన రచయిత నందిని సిధారెడ్డి, గాయకుడు దేశపతి శ్రీనివాస్ ఇద్దరూ మంజీర రచయితల సంఘం సభ్యులే. మరసం వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఉన్న నందిని సిధారెడ్డి సామాజిక ఉద్యమాలతో పాటు తెలంగాణ పోరాటంలోనూ తనదైన పాత్ర పోషించారు. మరసం ప్రభావంతోనే తెలంగాణ రచయితల వేదిక సైతం ఏర్పాటైంది. తెలంగాణ ధూంధాం ద్వారా తన ఆటపాటతో హోరెత్తించిన రసమయి బాలకిషన్‌కు ఈ సంఘమే ప్రేరణ. ప్రత్యేక రాష్ట్ర ఆవశ్యకతతోపాటు ఈ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాన్ని కళ్లకు కట్టడంలో 'మరసం' సభ్యుల పాత్ర అనిర్వచనీయం. 'తెలంగానం' పేరిట తెలంగాణ పాటలు ప్రాచుర్యం పొందడంలోనూ ఈ సంఘం కీలకమైంది. నాగేటి సాల్లల్ల ఆడియో క్యాసెట్‌ను ఆవిష్కరించారు.

సభా వివాహాలతో ఆదర్శం

వివాహ వ్యవస్థలో మార్పు తీసుకురావాలనే సంకల్పంతో వరకట్న రహితంగా 'మరసం' ఆధ్వర్యంలో సభావివాహాలు జరిగాయి. మంత్రాలు, డప్పుచప్పుళ్లు, వరకట్నాల ప్రస్తావన లేకుండానే వధూవరులను ఒక్కటి చేసిన ఘనత 'మరసం'కు దక్కుతుంది. మాజీ ఎమ్మెల్యే, దివంగత సోలిపేట రామలింగారెడ్డి ,సుజాత వివాహంతో ఈ సభావివాహాలకు శ్రీకారం చుట్టారు. ఆనాడు ప్రజాకవి కాళోజీతోపాటు సాహిత్యకారులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఇది ఉమ్మడి మెదక్ జిల్లాతోపాటు తెలంగాణ వ్యాప్తంగా నూతన ఒరవడికి నాంది పలికింది. నందిని భగవాన్‌రెడ్డి, వజ్రమ్మల వివాహాన్ని డాక్టర్ సి.నారాయణరెడ్డి జరిపించగా, బయ్యారం రాంరెడ్డి, పద్మల వివాహాన్ని ఎంటీ ఖాన్ చేతులమీదుగా జరిపించారు.

సామాన్యులకూ చేరువయ్యే కవిత్వం

సాధారణంగా కవితలను, కవిత్వాన్ని అర్థం చేసుకోవాలంటే సాహిత్యంపై కొంత అవగాహన ఉండాలి. కానీ మరసం ద్వారా వెలుగులోకి వచ్చిన పలు కవితా సంపుటాలు అందరికీ అర్థమయ్యేలా ఉంటాయి. అందుకే త్వరగా జనంలోకి చొచ్చుకెళ్లి ప్రజలను ఆకర్షించడమేగాకుండా చైతన్యవంతులను చేశాయి. తెలంగాణ యాసలో వచ్చిన సంపుటాలు సైతం తట్టిలేపాయి. ఉనికి, భూమిస్వప్నం, సంభాషణ, ప్రాణహిత, నేల తడవని వాన, సంతకం, వరదగూడు, నెమలికన్ను, పునాస, వడిసెల, పొనాది, గోరుకొయ్యలు, వయోలిన్ రాగమో, వసంత మేఘమో, సెలవింక అనే కవితా సంపుటాలు.. వ్యాస మంజీర, కదలిక, ఎడుపాయలు, మొగులైంది, పాట సంతకం అనే సంకలనాలు మరసం నుంచే వెలువడ్డాయి.

నేడు 38వ వార్షికోత్సవం

దాశరథి, ఆరుద్ర, బిరుదురాజు రామరాజుల శతజయంతి సందర్భంగా 'మరసం' 38వ వార్షికోత్సవ సమావేశాన్ని నేడు ఉదయం 10 గంటల నుంచి సిద్దిపేటలోని విపంచి టౌన్‌హాల్‌లో నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ ప్రారంభోపన్యాసం చేయనున్నారు. ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొంటారు. ప్రముఖ కవి, కబీర్ సమ్మాన్ అవార్డు గ్రహీత కె.శివారెడ్డి హాజరై ప్రసంగించనున్నారు. ఆరుద్ర సాహిత్య స్ఫూర్తి అనే అంశంపై నందిని సిధారెడ్డి, దాశరథి కవితా చైతన్యంపై ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, బిరుదురాజు రామరాజుపై సి.కాశీం ప్రసంగాలు ఉంటాయని మరసం అధ్యక్షుడు కలకుంట్ల రంగాచారి తెలిపారు.



మరసం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గొంతెత్తిన విప్లవ గాయకురాలు బెల్లి లలిత(ఫైల్)

'బతుకమ్మ'కు బంతిపూలు



రామచంద్రాపూర్‌లో కోతకు సిద్ధంగా ఉన్న బంతిపూల తోట

కుకునూరుపల్లి, సెప్టెంబరు 28: సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ. తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి ఆడబిడ్డలు ఆటపాటలతో చేసుకునే వేడుక. తొమ్మిదిరోజుల పాటు ఈ పండుగను ఎంతో సంబరంగా జరుపుకుంటారు. బతుకమ్మ పండుగ వచ్చిందంటే బంతిపూలకు చాలా గిరాకీ ఉంటుంది. మార్కెట్‌లో వివిధ రంగుల్లో బంతిపూలు లభిస్తున్నాయి. ఒకప్పుడు బంతిపూలను తక్కువగా.. ఇతర పువ్వులను ఎక్కువగా ఉపయోగించేవారు. ప్రస్తుతం తంగేడు పువ్వుతో పాటు ఇతర రకాల పువ్వులు దొరక్కపోవడంతో బంతిపూలకు డిమాండ్ పెరిగింది. సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండలంలో దాదాపు 50 ఎకరాల వరకు రైతులు బంతిపూలను సాగుచేస్తున్నారు. కేజీ బంతిపూలు రూ.50 నుంచి రూ.120 వరకు పలుకుతుంది. ఎంగిలి పువ్వు నుంచి సద్దుల బతుకమ్మ వరకు తొమ్మిది రోజులపాటు బంతిపూలకు డిమాండ్ ఉంటుంది. సద్దుల బతుకమ్మకు రెండురోజుల ముందు, ఆ తర్వాత దీపావళి పండుగకు బంతిపూలకు అత్యధిక డిమాండ్ ఉంటుంది.

ప్రతీ పనికో రేటు!

- పంచాయతీ కార్యదర్శులపై ఆరోపణలు
- పట్టణాల పరిసర గ్రామాల్లో హవా
- పాలకవర్గాలు లేకపోవడంతో ఇష్టారాజ్యం
- అనుమతులు, మ్యుటేషన్లకూ మామూళ్లు
- తాజాగా ఏసీబీకి చిక్కిన సెక్రెటరీ
- మరికొందరిపైనా ఏసీబీకి ఫిర్యాదులు?



'ఇల్లు, విద్యుత్ కనెక్షన్ పేరు మార్పు కోసం ఓ వ్యక్తి దరఖాస్తు చేసుకోగా రూ. 25వేలు ఖర్చవుతుందని చెప్పిన సంగారెడ్డి జిల్లా కొండాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిపై వేటుపడింది. రూ.5వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు.'

'ఝరాసంగం మండలం మాచునూరులో గ్రామ కంఠంలోని ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు వేసి వాటిని తమ కుటుంబ సభ్యుల పేరిట కేటాయించిన పంచాయతీ కార్యదర్శి, ఎంపీఈవోలపై వేటు పడింది. ఇటీవల అధికారులు విచారణ చేసి నిజమని తేలడంతో ఇద్దరిపై చర్యలు తీసుకున్నారు.'

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, సెప్టెంబరు 28: విధి నిర్వహణలో భాగంగా చేయాల్సిన పనులకూ ఉమ్మడి జిల్లాలో కొందరు కార్యదర్శులు ధరలు నిర్ణయిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొంతమంది చిత్తశుద్ధితో తమ గ్రామాల అభివృద్ధి కోసం శ్రమిస్తుండగా.. మరికొందరేమో అడ్డదారుల్లో సంపాదనకు అలవాటుపడి అవినీతికి పాల్పడుతున్నారు. తమ అధికారాలను అడ్డం పెట్టుకొని అక్రమాలకు దారులు వేస్తున్నారు.

కార్యదర్శుల హవా..

పట్టణాలకు సమీపంలో ఉన్న గ్రామాల్లో పలువురు పంచాయతీ కార్యదర్శులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సంగారెడ్డి, కంది, సదాశివపేట, కొండాపూర్, పటాన్‌చెరు, జహీరాబాద్, మెదక్, తూప్రాన్, మనోహరాబాద్, సిద్దిపేట అర్బన్, గజ్వేల్, నర్సాపూర్, హత్నూర, మాసాయిపేట, జిన్నారం, గుమ్మడిదల మండలాల్లోని పలు గ్రామాల కార్యదర్శులపై అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణాలకు సమీపంలో ఉండడం, పరిశ్రమలు విస్తరించడం, రియల్ ఎస్టేట్ వ్యాపారం ఎక్కువగా జరగడంతో భూములకు డిమాండ్ ఏర్పడింది. పెద్ద సంఖ్యలో కొత్త ఇండ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. పుట్టగొడుగుల వలె వెంచర్లు పుట్టుకొస్తున్నాయి. ఈ క్రమంలో ఇళ్ల నిర్మాణానికి ఎన్‌వోసీలు, ఇతర అనుమతులు ఇవ్వాలంటే కార్యదర్శులు 'నాకేంటి' అని అంటున్నారు. ఓనర్‌షిప్ సర్టిఫికెట్లు, కొత్త విద్యుత్ మీటరు, బర్త్, డెత్ సర్టిఫికెట్లకు కూడా ధరలు నిర్ణయిస్తున్న కార్యదర్శులు ఉన్నారు.

అవినీతిపరులపై ఫిర్యాదులు..

ఇప్పటికే కొండాపూర్ పంచాయతీ సెక్రటరీని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇతని బాటలోనే మరికొందరిపైనా అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డబ్బులు ఇవ్వనిదే మ్యారేజ్, బర్త్, డెత్ సర్టిఫికెట్లు జారీ చేయరని, పింఛన్ల పేరిట డబ్బులు అడుగుతున్నారని, ఏ పనికైనా ఒక రేటు కడతారని పలువురు కార్యదర్శుల గురించి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. కార్యదర్శులపై ఫిర్యాదులు వచ్చినా మొక్కుబడిగా స్వీకరిస్తున్నారని జిల్లా స్థాయి అధికారులపైనా ఆరోపణలు లేకపోలేదు. కొన్ని గ్రామాల్లో కార్యదర్శులను జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు సైతం ప్రోత్సహిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదనే నెపంతో ఇటీవల కొందరు ఏసీబీ అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. ఇలా ఏసీబీ చేతిలో పలువురు కార్యదర్శుల అవినీతి చిట్టా కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

ఒక్కొక్కరిది ఒక్కోతీరు

పంచాయతీ కార్యదర్శుల్లో కొందరి అక్రమాల మూలంగా అందరిపైనా నిందలు పడుతున్నాయనే చర్చ జరుగుతోంది. వాస్తవానికి చాలా గ్రామాల్లో నిధుల కొరత మూలంగా కార్యదర్శులు తమ సొంతంగా మరమ్మతు పనులు చేయిస్తున్నారు. అప్పులు తెచ్చి గ్రామాలకు ఖర్చు చేసి ఆ తర్వాత బిల్లులు పొందుతున్నారు. ఇంకొందరైతే గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని, గ్రామంతోపాటు తమకూ పేరు రావాలని కష్టపడుతున్నారు. ఉదయం చెత్తసేకరణ నుండి రాత్రి వీధి దీపాలు వెలిగేవరకు తమ ముద్ర కనిపించేలా వ్యవహరిస్తున్నారు. కార్యదర్శుల్లో యువతీయువకులే ఎక్కువగా ఉండడంతో ఒక లక్ష్యంతో కృషి చేస్తున్నారు. కానీ కొంతమంది అవినీతికి పాల్పడుతూ అడ్డదారులు తొక్కుతున్నారు. గ్రామాల్లో సర్పంచ్‌లు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారు. ప్రత్యేకాధికారులకూ పట్టింపు లేనందున ఇక కార్యదర్శులే అన్నీ తామై వ్యవహరిస్తున్నారు. కొందరేమో అక్రమాలకు అలవాటుపడుతూ అదనపు ఆదాయం పొందుతుండగా.. మరికొందరేమో తమ జేబుల్లో నుండే గ్రామాలకు వెచ్చిస్తూ నెట్టుకొస్తున్నారు.

అన్నివర్గాలకు పౌష్టికాహారం అందేలా చూడాలి

- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, పక్కన కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబరు 28: సిద్దిపేట జిల్లాలో అన్ని వర్గాల ప్రజలకు నాణ్యమైన పౌష్టికాహారం అందేలా పర్యవేక్షణ చేయాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు జిల్లా అధికార యంత్రాంగానికి సూచించారు. శనివారం జిల్లాలోని సిద్దిపేట అర్బన్ మండలంలో గల కేజీబీవీ, తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయం, చిన్నకోడూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఫుడ్ కమిషన్ చైర్మన్, సభ్యులు ఆకస్మికంగా సందర్శించి, విద్యార్థులకు అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. అలాగే చిన్నకోడూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రం-4ను, సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామంలో గల కేజీబీవీ, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో జాతీయ ఆహార భద్రత చట్టం-2013 అమలుపై సంబంధితశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయాశాఖల ద్వారా జాతీయ ఆహార భద్రత చట్టం ప్రకారం తీసుకున్న చర్యలను సంబంధిత శాఖల జిల్లా అధికారులు వివరించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్, సభ్యులు మాట్లాడుతూ.. జిల్లాలోని నిరుపేదలకు ఆహార భద్రత కార్డుల ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన మొత్తంలో రేషన్ సరుకులు ఇవ్వాలన్నారు. బయోమెట్రిక్‌లో వేలిముద్రలు రావడం లేదని, ఐరిష్ పనిచేయడం లేదని తదితర అభ్యంతరాలు చూపొద్దన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు అన్ని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, కేజీబీవీలు, గురుకులాల్లో చదివే విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించేలా జిల్లా, మండలస్థాయి అధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్య, డీసీవో తనూజ, డీఎం ప్రవీణ్, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, డీడబ్ల్యూవో శారద, వైద్య శాఖ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ముందస్తు సమాచారంతో అలర్ట్

ఫుడ్ కమిషన్ బృందం తనిఖీకి వస్తున్నారని, జాగ్రత్తగా ఉండాలని విద్యాధికారులు ముందస్తు సమాచారం ఇవ్వడంతో హాస్టల్ సిబ్బంది అలర్ట్ అయ్యి ఉంటారని, సమాచారం లేకుండానే తనిఖీలు నిర్వహించాలని పలువురు కోరుతున్నారు. 'హాస్టల్ సిబ్బందికి ముందస్తు సమాచారం' అనే కథనం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైనా అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు ఉన్నాయి.

పెండింగ్ కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ వేదిక

- సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి
- 5,301 కేసులు పరిష్కారం



రోడ్డు ప్రమాద బాధితులకు ఇన్సూరెన్స్ పత్రాలను అందజేస్తున్న సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 28: పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్ వేదిక అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి పేర్కొన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా కోర్టు ఆవరణలో ఆమె ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షణికావేశంలో చేసిన తప్పులు, పెండింగ్ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరిగే బదులు ఒకేసారి లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకుంటే సమయం, డబ్బు వృథా కాకుండా పోతుందని తెలిపారు. సిద్దిపేట, చేర్యాల, దుబ్బాక, గజ్వేల్ కోర్టు ఆవరణలో నిర్వహించిన లోక అదాలత్‌లో 5,240 క్రిమినల్ కేసులను, 61 సివిల్ కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. 27 రోడ్డు ప్రమాదం కేసుల్లో బాధితులకు రూ.2,52,7000 ఇన్సూరెన్స్ కంపెనీల నుంచి డబ్బులను అప్పగించామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి స్వాతిరెడ్డి, అడిషనల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి మిలింద్ కాంబ్లే, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి చందన, అడిషనల్ సివిల్ న్యాయాధికారి శ్రావణి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జనార్దన్‌రెడ్డి, న్యాయవాదులు రవీందర్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

టీజీవో జిల్లా అధ్యక్షుడిగా శ్రీరామ్‌రెడ్డి



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న టీజీవో ప్రతినిధులు

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబరు 28: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం(టీజీవో) సిద్దిపేట జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ శ్రీరామ్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం సిద్దిపేటలోని ఓ హోటల్లో టీజీవో సమావేశాన్ని ఏర్పాటు చేసుకుని.. జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీజీవో జిల్లా కార్యదర్శిగా శ్రీనివాస్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కొండల్‌రెడ్డి, ట్రెజరర్‌గా నరసింహ, ఉపాధ్యక్షులుగా సురేష్, సుజాత, జయశ్రీ, సంయుక్త కార్యదర్శిగా రాధిక, ఖాజా, సువర్ణ, ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు, సెక్రెటరీ సత్యనారాయణ, తదితర నాయకులు నూతన కార్యవర్గాన్ని అభినందించారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీరామ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగులకు అందుబాటులో ఉంటూ.. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

మందుబాబులకు అడ్డాగా రైతువేదికలు

- విధులకు వచ్చే అధికారులకు స్వాగతం పలుకుతున్న ఖాళీ మద్యం సీసాలు





నారాయణరావుపేట రైతువేదిక, వెంకటాపూర్ రైతువేదిక వద్ద జాతీయజెండా దిమ్మెపై మద్యం గ్లాసు(ఫైల్)

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 28: గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన రైతువేదికలు, ప్రభుత్వ కార్యాలయాలు మందుబాబులకు అడ్డాలుగా మారుతున్నాయి. రాత్రివేళల్లో దర్జాగా మద్యం సేవించి ఖాళీ సీసాలను ధ్వంసం చేస్తున్నారు. దీంతో ఉదయాన్నే విధులకు వచ్చే అధికారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సిద్దిపేట రూరల్ మండలం నారాయణరావుపేట మండలంలోని గ్రామ శివారులోని రైతువేదికను మందుబాబులు అడ్డాగా మార్చుకుని రాత్రివేళల్లో మద్యం సేవిస్తున్నారు. సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్‌లోని రైతువేదిక ఆవరణం ఎదుట జాతీయ జెండా ఎగురవేసే దిమ్మెపై మద్యం గ్లాసు దర్శనమివ్వగా.. తాజాగా నారాయణరావుపేట మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద ప్రతిరోజూ మద్యం సీసాలు దర్శనమిస్తుండడంతో రైతులు, ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే పోలీసులు గ్రామాల్లో గస్తీ పెంచాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

మహిళల భద్రతకు 'భరోసా'

● సంగారెడ్డి అదనపు ఎస్పీ సంజీవరావు



కేక్ కట్ చేస్తున్న ఏఎస్పీ సంజీవరావు, సిబ్బంది

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 28: మహిళలు, బాలికల భద్రతకు 'భరోసా' కేంద్రం ప్రాధాన్యమిస్తుందని సంగారెడ్డి అదనపు ఎస్పీ ఎ.సంజీవరావు పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లాలో భరోసా కేంద్రం ప్రారంభమై నాలుగు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శనివారం వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న నేరాలను నివారించడానికి అవసరమయ్యే అన్నిరకాల సేవలను ఒకే గొడుగు కింద అందించాలనే సంకల్పంతోనే ప్రభుత్వం భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 526 పోక్సో, అత్యాచార కేసుల్లో బాధితులకు మెడికల్, లీగల్ సేవలను అందించడంతోపాటు రూ.1.10 కోట్ల నష్టపరిహారం ఇప్పించినట్లు వివరించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రమీల, ఎస్ఐ పూలబాయ్ తదితరులు పాల్గొన్నారు.

జలదిగ్బంధంలోనే వనదుర్గమాత ఆలయం



జలదిగ్బంధంలో ఏడుపాయల వన దుర్గ మాత ఆలయం

పాపన్నపేట, సెప్టెంబరు 28: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గా మాత ఆలయం వద్ద ఐదు రోజులుగా గంగమ్మ పరవళ్లు తొక్కుతుంది. సింగూరు ప్రాజెక్టు నుంచి దిగువకు నీటి విడుదల కొనసాగుతుండటంతో ఆలయం వద్ద వరద కొనసాగుతుంది. దీంతో ఆలయాన్ని మూసివేసిన సంగతి తెలిసిందే. శనివారం సైతం భక్తుల సౌకర్యార్థం రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజలు కొనసాగాయి. భక్తులు మాతను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వనదుర్గా ప్రాజెక్టు నుంచి 26000 క్యూసెక్కుల వరదనీరు దిగువకు ప్రవహిస్తుంది.

గౌరవెల్లి రిజర్వాయర్‌కు రూ.1000 కోట్లు ఇవ్వండి

● మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సీపీఐ నేత చాడ వెంకటరెడ్డి వినతి



ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్, సెప్టెంబరు 28 : శ్రీరాంసాగర్ వరద కాలువ గౌరవెల్లి రిజర్వాయర్‌కు రూ. 1000 కోట్లు విడుదల చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించినట్లు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రాజెక్టుకు నిధులు లేక కెనాల్స్ నిర్మాణ పనులు నిలిచిపోయాయని వెల్లడించారు. గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిందని పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్వాసితులకు రావాల్సిన పునరావాస ప్యాకేజీ పెండింగ్‌లో ఉన్నాయని, దీంతో ముంపు బాధితులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. అలాగే గండిపల్లి రిజర్వాయర్ పనులు 50 శాతం పనులు మాత్రమే పూర్తయి పెండింగ్‌లో ఉందని తెలిపారు. గత 30 సంవత్సరాల నుంచి నత్తనడకన సాగుతున్న వరదకాలువ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని మంత్రిని కోరగా, సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

భయం భయంగా..

● శిథిలావస్థలో సర్కారు బడులు ● బిక్కుబిక్కుమంటూ విద్యార్థుల చదువులు
● బడికి పంపేందుకు జంకుతున్న తల్లిదండ్రులు ● మరమ్మతులకు నోచుకోని వైనం


ఇస్మాయిల్‌ఖాన్‌పేటలో కూలేందుకు సిద్ధంగా ఉన్న ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల భవనం


పై పెచ్చులూడిన తరగతి గది

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 28 : ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించి ఉత్తమ ర్యాంకులు సాధించేందుకు ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు శ్రమిస్తున్నారు. కానీ ప్రభుత్వ పాఠశాలలు శిథిలావస్థల్లో ఉండడంతో భయం భయంగా చదువుతున్నారు. కొన్ని పాఠశాలల్లో పైకప్పు పెచ్చులూడి విద్యార్థులకు గాయాలైన సంఘటనలు ఉన్నాయి. బడులకు మరమ్మతులు చేయాల్సిన విద్యాశాఖాధికారులు పట్టించుకోకపోవడంతో చేసేది లేక శిథిలావస్థలోని భవనాల్లోనే బిక్కుబిక్కుమంటూ చదువులు కొనసాగిస్తున్నారు. శిథిలావస్థలో ఉన్న బడికి తమ పిల్లలను పంపిస్తే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలను బడిని మాన్పించారు.

5,680 మంది విద్యార్థులు..

మండలవ్యాప్తంగా మొత్తం 50 ప్రభుత్వ పాఠశాలల్లో 5,680 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. బడుల్లో మౌలిక వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బడిబాట కార్యక్రమంతో విద్యార్థుల సంఖ్య పెరిగిందని సంబరపడిపోయే అధికారులు, సర్కారు బడుల్లో పిల్లలు ఉండేలా చర్యలు తీసుకోవడం విఫలమవుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ బడుల్లో వసతులు సరిగా లేక ప్రైవేటు స్కూళ్లలో చేర్పించిన దాఖలాలు ఉన్నాయి. మండల పరిధిలోని ఇస్మాయిల్‌ఖాన్‌పేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పూర్తిగా శిథిలావస్థలకు చేరడంతో విద్యార్థులను ఆరుబయటే కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తుండగా, చింతలపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వెళ్లే దారిలేక విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఇదే గ్రామంలోని మరో ప్రాథమిక పాఠశాల వర్షానికి పదును వచ్చి గోడలకు పగుళ్లు వచ్చాయి. ఇరిగిపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో నర్సరీ ఉండడంతో విష సర్పాలు సంచరిస్తున్నాయి. దీంతో ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితుల్లో పిల్లలు, ఉపాధ్యాయులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ భయంతోనే కొందరు పిల్లలను తల్లిదండ్రులు బడికి మాన్పించి, నర్సరీని ఇక్కడి నుంచి వేరే ప్రాంతానికి తరలించాలని అధికారులకు విన్నవించారు. ఏదేమైనప్పటికీ శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు మరమ్మతులు చేసి మౌలిక సదుపాయాలు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


ఆరు బయటే పాఠాలు

నిజాంపేట, సెప్టెంబరు 28 : మండల పరిధిలోని రాంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో తప్పని పరిస్థితుల్లో విద్యార్థులే ఆరుబయట చెట్ల కింద, వరండాలో కూర్చొని పాఠాలు వినాల్సిన దుస్థితి నెలకొన్నది. ఏడు సబ్జెక్టులను బోధించే ఉపాధ్యాయులు ఉన్నా కేవలం రెండు తరగతి గదులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మిగతా తరగతులు ఆరు బయటే నిర్వహిస్తున్నారు. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి వంటలు కూడా చెట్టకిందనే కానిస్తున్నారు. కనీసం పాఠశాలకు ప్రహరీ కూడా లేకపోవడంతో కోతుల బెడదతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. పాఠశాల ఆవరణలోకి పశువులు, కుక్కలు వస్తున్నాయని అధికారులు స్పందించి వసతులు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు



చింతపల్లిలోని ప్రాథమిక పాఠశాల..




చింతపల్లి పాఠశాల దుస్థితి


పెచ్చులూడడంతో బయట కూర్చున్న విద్యార్థులు

ఎనిమిది తరగతులు.. ముగ్గురే టీచర్లు..!

● అందులోనూ ఇద్దరు సెలవులో.. ఒక్కరితోనే బోధన


ఉపాధ్యాయులు లేక ఆటపాటలతో నిమగ్నమైన విద్యార్థులు

అల్లాదుర్గం, సెప్టెంబరు 28 :ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యనందిస్తున్నామని ప్రభుత్వం పదే పదే ప్రకటిస్తున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో మాత్రం అమలుకావడం లేదు. అందుకు అల్లాదుర్గం మండలంలోని రాంపూర్ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలనే నిదర్శనం. ఈ పాఠశాలలో 8 తరగతులకు గాను 84 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి అనువుగా ఉపాధ్యాయులను నియమించకపోవడం పలు విమర్శలకు తావిస్తుంది. ఈ పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులుండగా వారిలో ఇద్దరు సెలవులో ఉన్నారు. మిగిలిన ఒక్క టీచర్‌తోనే ఎనిమిది తరగతులకు విద్యాబోధన చేయడంపై స్థానికులు కొందరు శనివారం పాఠశాలను సందర్శించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల కొరతతో గత ఐదు రోజులుగా విద్యార్థులు ఆటపాటలకే పరిమితమవుతున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై విధుల్లో ఉన్న ఉపాధ్యాయురాలు జాస్సీని వివరణ అడగగా ప్రధానోపాధ్యాయుడు దుర్గాప్రసాద్, మరో ఉపాధ్యాయుడు దేవిసింగ్ సెలవులో ఉన్నరన్నారు. 8 తరగతులకు విద్యాబోధన చేయడం ఇబ్బందిగా ఉందన్నారు. అయితే తాము ముగ్గురమూ ఇతర పాఠశాలలకు బదిలీ అయ్యామని, ఇక్కడికి టీచర్ల నియామకం జరగకపోవడంతో తాము రిలీవ్ కాలేదని తెలిపారు.

ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ ఎంపికలు


అథ్లెటిక్స్ ఎంపిక పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కొండాపూర్, సెప్టెంబరు 28 : కొండాపూర్ మండలం గిర్మాపూర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో స్కూల్ గేమ్స్ ఇంటర్మీడియట్ ఫెడరేషన్(ఎస్జీఎఫ్)ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ ఎంపికలు శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ ఎంపికల్లో ఉమ్మడి జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి 300 మంది బాలబాలికలు హాజరయ్యారు. అండర్-19 అథ్లెటిక్స్ ఎంపికల్లో భాగంగా వివిధ క్రీడాంశాల్లో తలపడ్డారు. కార్యక్రమంలో డీఐఈవో గోవిందరామ్, ఎస్జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గణపతి, కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, వ్యాయామ ఉపాధ్యాయులు ధన్‌రాజ్, జుబేర్, మోహన్, బస్వరాజ్, రుక్కమ్మ, శశిరేఖ, మంజుల, మమత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ నివారణపై శిక్షణ


విజేతలతో డీఈవో వెంకటేశ్వర్లు, అధికారులు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 28 : సంగారెడ్డిలోని జిల్లా సైన్స్ కేంద్రంలో విద్యాశాఖ ఎస్‌సీఈఆర్‌టీ సౌజన్యంతో అడాలసెంట్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాంలో(ఏఈపీ) భాగంగా పాఠశాల విద్యార్థులకు హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణపై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని 84 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్ నుంచి విచ్చేసిన 84 మంది జీవశాస్త్ర ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవగాహన కల్పించడంతోపాటు విద్యార్థులకు పోస్టర్ మేకింగ్‌పై పోటీలు నిర్వహించి విజేతలకు డీఈవో వెంకటేశ్వర్లు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎయిడ్స్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డానియల్, విద్యాశాఖ అధికారులు అనురాధ, వెంకటేశం, సిద్ధారెడ్డి, సుప్రియ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేవరకు ఆందోళనలు

● వర్గల్ టీజీఐఐసీ భూ నిర్వాసితులు


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న భూనిర్వాసితులు

వర్గల్, సెప్టెంబరు 28 : తమ సమస్యలు పరిష్కరించేవరకు ఆందోళనలు కొనసాగిస్తామని టీజీఐఐసీ భూనిర్వాసితులు స్పష్టం చేశారు. సదరు భూముల వద్ద వారు చేస్తున్న ఆందోళనలు శనివారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ గత ప్రభుత్వం తమకు అరకొర పరిహారంతో అందించి పరిశ్రమలకు రూ.కోటికి ఎకరం చొప్పున విక్రయించిందన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం ఇప్పటివరకు ఇళ్ల స్థలాలు చూపలేదన్నారు. ఇంటి స్థలాల ఎంపికలోనూ అక్రమాలు చోటు చేసుకున్నాయన్నారు. తమకు న్యాయం జరిగేంతవరకు పోరాడుతామని హెచ్చరించారు.

సమస్య పరిష్కారానికి కృషి : తహసీల్దార్

టీజీఐఐసీ భూనిర్వాసితుల సమస్యలను ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని వర్గల్ తహసీల్దార్ బాల్‌రాజు హామీ ఇచ్చారు. శనివారం ఆందోళనా శిబిరాన్ని సందర్శించిన ఆయనకు భూ నిర్వాసితులుకు తమ డిమాండ్లు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆయన రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చుతామన్నారు.

అక్టోబరు 5వరకు ధ్రువపత్రాల పరిశీలన

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 28 : సంగారెడ్డిలోని డీఈవో కార్యాలయంలో 2008-డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన శనివారం కొనసాగింది. ఈ ప్రక్రియను డీఈవో వెంకటేశ్వర్లు స్వయంగా పరిశీలించారు. 292 మందికిగాను ఇప్పటివరకు 176 మంది అభ్యర్థులు మాత్రమే ధ్రువపత్రాల పరిశీలనకు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇంకా ఎవరైన అభ్యర్థులు ఉంటే అక్టోబరు 5 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయించుకోవాలని డీఈవో తెలిపారు.

ఎవరో ఈ బాలుడు

● మూడు నెలలుగా పోలీసుల సంరక్షణలో..

చేగుంట, సెప్టెంబరు 28 : చేగుంట మండలం వడియారం రైల్వేస్టేషన్‌లో ఫ్లాట్ ఫాం వద్ద గత జూన్ 26న గుర్తుతెలియని వ్యక్తులు ఓ బాలుడిని ఒంటరిగా వదిలివెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడి చేరుకుని బాలుడిని చేరదీశారు. మూడు నెలలు గడిచినా బాలుడి ఆచూకీ కోసం ఎవరూ రాకపోవడంతో శనివారం బాలుడిని మెదక్‌లోని బాలల సంరక్షణ కేంద్రానికి తరలించామని, సంబంధీకులు ఎవరైనా ఉంటే చేగుంట పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్సై చైతన్య కమార్‌రెడ్డి తెలిపారు.


లభ్యమైన బాలుడు

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

● కాంగ్రెస్ పాలనలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం
● అల్ఫోర్స్ విద్యా సంస్థల చెర్మన్ నరేందర్‌రెడ్డి

హుస్నాబాద్, సెప్టెంబరు 28 : ప్రతీ పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని అల్ఫోర్స్ విద్యా సంస్థల ఛైర్మన్ వుట్కూరి నరేందర్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన హుస్నాబాద్ పట్టణంలోని ఓ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పట్టభద్రుల సమస్యల పరిష్కారం కోసమే ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు వెల్లడించారు. ఎంతో మంది డబుల్ పీజీలు, పీహెచ్‌డీలు చేసినప్పటికీ ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారి సమస్యలను పరిష్కరించడానికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో ఉద్యోగుల సమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు. అనంతరం పలువురు పట్టభద్రులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు.

ముందస్తు బతుకమ్మ సంబరాలు

హుస్నాబాద్ పట్టణంలోని అల్ఫోర్స్ పబ్లిక్ స్కూల్‌లో శనివారం ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ఆ విద్యా సంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి హాజరై దుర్గామాత విగ్రహానికి పూజలు చేశారు. హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు నరేందర్‌రెడ్డి వాటర్ ప్లాంట్‌ను వితరణ చేయగా శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఆకుల రజిత, కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, హెచ్ఎం వెంకటయ్య, పెరుమాండ్ల శ్రీనివాస్ తదితరులున్నారు.


విద్యార్థినులతో కలిసి బతుకమ్మ ఆడుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డి



సింగూరు ప్రాజెక్టుకు తగ్గని వరద

● 29.917 టీఎంసీలకు 29.768 టీఎంసీలు నిల్వ

పుల్‌కల్, సెప్టెంబరు 28: ఎగువ ప్రాంతాల నుంచి సింగూరు ప్రాజెక్టుకు వరద నీటి ప్రవాహం తగ్గడం లేదు. శనివారం సాయంత్రం అందిన సమాచారం మేరకు ప్రాజెక్టులోకి 14,531 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నది. వారం రోజులుగా ప్రాజెక్టుకు ఎగువన గల మంజీర నుంచి వరద వస్తున్నది. శుక్రవారం ప్రాజెక్టులోకి 20,546 క్యూసెక్కుల వరద నీటి ప్రవాహం రావడంతో 6, 11వ నంబర్ క్రస్టుగేట్లను రెండు మీటర్లు ఎత్తి 20,546 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ప్రవాహం కొంతమేరకు తగ్గుముఖం పట్టడంతో 6వ నంబరు క్రస్టుగేటును శనివారం సాయంత్రం మూసివేసినట్లు ప్రాజెక్టు జేఈఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం 11వ నంబరు క్రస్టుగేట్ మీటరున్నర ఎత్తు ఎత్తి 8,142 క్యూసెక్కులు, జల విద్యుత్ ఉత్పత్తి గేట్ల గుండా 2,725 క్యూసెక్కుల వరద జలాలను దిగువన మంజీర రిజర్వాయర్‌కు వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 29.917 టీఎంసీలకు 29.768 టీఎంసీలు నీటి నిల్వలున్నాయి. ఇదిలావుండగా, మంజీర రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి వరద నీరు వస్తుండటంతో 7, 8వ నంబరు క్రస్టుగేట్లను మూడున్నర మీటర్లు, 4వ నంబరు క్రస్టుగేట్‌ను మీటరు, ఒక స్కవర్ గేట్‌ను మీటరున్నర ఎత్తి వచ్చిన వరద నీటిని వచ్చినట్లుగానే ఘనపురం ప్రాజెక్టుకు వదులుతున్నారు.

కదం తొక్కిన కార్మికలోకం

● కలెక్టరేట్ ముట్టడికి భారీగా కార్మికులు

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 28 : కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జాతీయ కమిటీ పిలుపు మేరకు సీఐటీయూ శనివారం చేపట్టిన కలెక్టరేట్ ముట్టడికి కార్మికులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ అతిథి గృహం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చి ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. కనీస వేతనం రూ.29610 పెంచినట్టు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, కార్మికులు ఆ ప్రకటనలను చూసి మోసపోవదన్నారు. ఇదే కొనసాగితే కార్మికుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్ ఏవో పరమేశంకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి మల్లేశం, జిల్లా కార్యదర్శి జీ. సాయిలు, పాండు, ప్రవీణ్, రాజయ్య, మహిపాల్, బాగారెడ్డి, బాబురావు, నాగేశ్వరరావు, సతీష్, కొండల్‌రెడ్డి, శోభ, రమాదేవి, రాజు,, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్

ఉత్సాహంగా యువజనోత్సవాలు

● రాష్ట్రస్థాయికి 53 మంది ఎంపిక

మెదక్ అర్బన్, సెప్టెంబరు : జిల్లా కేంద్రంలోని అవుట్‌డోర్ స్టేడియంలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సహాలు ఉల్లాసంగా- ఉత్సాహంగా జరిగాయి. విద్యార్థినుల ఆట, పాటలతో స్టేడియం హోరెత్తింది. జాతీయ నేతల వేషధారణతో వారిని అభినయిస్తూ సాగిన రూపకాలు అలరించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడుతూ.. యువత చదువుతోపాటు కళల్లో రాణించాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జానపద నృత్యం,గీతం, డ్యాన్స్, హస్త కళలు, కథా రచన, పెయింటింగ్ తదితర తొమ్మిది అంశాల్లో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చి 53 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు డీవైఎస్‌వో దామోదర్‌రెడ్డి తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ చంద్రపాల్, డీఈవో రాధాకిషన్, డీఎస్‌వో రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

ప్రభుత్వ పాఠశాలలకు ఐఐటీహెచ్ చేయూత

● అక్షర్‌ధాన్‌లో భాగంగా కంప్యూటర్ల పంపిణీ

కంది, సెప్టెంబరు 28 : రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలకు సంగారెడ్డి జిల్లా కందిపరిధిలోని ఐఐటీ హైదరబాద్ చేయూతను అందిస్తుంది. పేద విద్యార్థులు డిజిటల్ విద్యను అభ్యసించేందుకు అక్షరమాల-అక్షర్‌ధాన్ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోని మారుమూల పల్లెల్లో ప్రభుత్వ పాఠశాలలో చదివే నిరుపేద విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఆన్‌లైన్ ద్వారా పాఠ్యంశాలను బోధించడానికి కొంతమంది వలంటీర్లను సైతం నియమించింది. అక్షర్‌ధాన్‌లో భాగంగా శనివారం కంది మండలంలోని చిమ్నాపూర్, లక్ష్మీనగర్‌కాలనీ, కలివేముల తదితర గ్రామల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు ఐఐటీహెచ్ అధికారులు కంప్యూటర్లను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిద్దిడానికి ఐఐటీహెచ్ కృషి చేస్తుందని, మారుమూల గ్రామల విద్యార్థులు కూడా డిజిటల్ విద్యకు దగ్గరకావడానికి అక్షర్‌ధాన్ కార్యక్రమం చేపట్టామని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి పేర్కొన్నారు.


కలివేముల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు కంప్యూటర్లను అందజేస్తున్న ఐఐటీహెచ్ అధికారులు

11 కిలోల గంజాయి స్వాధీనం


నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న గంజాయి

పటాన్‌చెరు, సెప్టెంబరు 29: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు నిందితుల నుంచి 11 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న సంఘటన శనివారం పటాన్‌చెరులో చోటు చేసుకుంది. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన శంబూసింగ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణాజిల్లాకు చెందిన హర్షవర్ధన్ వేర్వేరు ప్రాంతాల్లో గంజాయిని విక్రయిస్తున్నారని మెదక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందానికి సమాచారం అందింది. దీంతో ఎక్సైజ్ సిబ్బంది అక్కడికి చేరుకని నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి సుమారు ఐదు లక్షలు విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులను అరెస్టే చేసి రిమాండ్‌కు తరలించారు.

ఏటీఎం కార్డు మార్చి రూ.71వేలు చోరీ

రామాయంపేట, సెప్టెంబరు 28 : ఏటీఎంలో డబ్బులు కోసం ఓ రైతును ముగ్గురు వ్యక్తులు మోసం చేసి 71 వేలు డ్రా చేసుకున్నారు. ఈ ఘటన శుక్రవారం రామాయంపేటలోని ఎస్బీఐ ఏటీఎంలో జరిగింది. వివరాల్లోకి వెళ్లితే మండలంలోని కాట్రియాలకు చెందిన రాజయ్య అనే రైతు ఏటీఎంలో డబ్బులు డ్రా చేసేందుకు వెళ్లాడు. అప్పటికే అక్కడ ఉన్న ముగ్గురు వ్యక్తులు అతన్ని మభ్యపెట్టి తమ వద్ద ఉన్న కార్డును ఏటీఎంలో పెట్టి అతని కార్డు లాగేశారు. ఇది గమనించని రాజయ్య వారు వెళ్లిన తరువాత డబ్బులు డ్రా చేయబోగా.. రాకపోయేసరికి వెళ్లి పోయాడు. కాగా, అదేరాత్రి అతనికి వచ్చిన ఫోన్ మెసేజ్ చూసుకొని నివ్వెరపోయిన రాజయ్య శనివారం పోలీసులను ఆశ్రయించాడు. సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు..

వాగులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

జహీరాబాద్, సెప్టెంబరు 28 : మండలపరిధిలోని బూచనెల్లి-బరూర్ గ్రామాలమధ్యలో గల నారింజవాగులో ఈ నెల 25న గల్లంతైన వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైందని తహసీల్దార్ రవీందర్, పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం కర్ణాటకలోని బీదర్‌కు చెందిన షాకీర్ వాగులో గల్లంతవ్వగా నాలుగైదు రోజులుగా గాలింపు చర్యలు చేపట్టగా సత్వార్ గ్రామశివారులోని నారింజవాగులో ఒడ్డున అతడి మృతదేహం కనిపించింది.


షాకీర్(ఫైల్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

తూప్రాన్, సెప్టెంబరు 28: తూప్రాన్ పట్టణంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే.. మెదక్ జిల్లా శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామానికి చెందిన అంసాన్‌పల్లి శ్రీనివాస్ రెడ్డి (50) కొన్నేళ్లుగా తూప్రాన్ మండలం శివ్వంపేటలో నివాసముంటున్నాడు. శుక్రవారం సాయంత్రం ఇంటినుంచి బయటకు వెళ్లిన శ్రీనివాస్‌రెడ్డి తూప్రాన్ పట్టణంలో పెట్రోల్ బంక్ సమీపంలో లిక్కర్ మార్టు వద్ద శనివారం ఉదయం శవమై కనిపించాడు. సమాచారం అందుకున్న తూప్రాన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహన్ని పోస్టుమార్టం కోసం మార్చురీకి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


శ్రీనివాస్‌రెడ్డి మృతదేహం

విద్యుదాఘాతంతో రైతు మృతి

మిరుదొడ్డి, సెప్టెంబరు 28 : విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన సంఘటన శనివారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఎనగుర్తి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ హరీష్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన యాదగిరి(42) పొలం వద్ద బోరుమోటరు నడవకపోవడంతో పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫారర్ వద్దకు వెళ్లి మరమ్మతులు చేస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడిఅక్కడే మృతిచెందాడు. యాదగిరి ఎంతకీ ఇంటికి రాకపోవడం అతడి తండ్రి లక్ష్మీనారాయణ పొలం వద్దకు వెళ్లిన చూడగా మృతిచెంది కనిపించాడు సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని శవానికి పంచానామా నిర్వహించారు ఈ మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


యాదగిరి (ఫైల్)

వాహనం ఢీకొట్టి యువకుడు..

మనోహరాబాద్, సెప్టెంబరు 28: రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ వివరాల ప్రకారం మనోహరాబాద్ మండలం కూచారం గ్రామానికి చెందిన అర్కల నిరంజన్(26) గ్రామ శివారులోని పరిశ్రమలలో కూలీ పనులు చేసుకుంటూ సాగిస్తున్నాడు. శుక్రవారం రాత్రి కాళ్లకల్ శివారులోని రాఘవేంద్ర హోటల్‌లో బోజనం చేసి పక్కనే ఉన్న 44వ జాతీయ రహదారి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం వచ్చి నిరంజన్‌ను ఢీకొట్టగా అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తండ్రి రాంచందర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


నిరంజన్ (ఫైల్)

రెండోరోజుకు బొడ్డెమ్మ ఆటలు



బొడ్డెమ్మ ఆడుతున్న మహిళలు

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబర్ 28: బొడ్డెమ్మ పండుగ సంబురం సిద్దిపేటలో కొనసాగుతున్నది. రెండోరోజు శనివారం ఆడపడుచులు బొడ్డెమ్మలను తీరొక్క పూలతో అలంకరించారు. బొడ్డెమ్మలను పెట్టి చుట్టూ తిరుగుతూ ఆటపాటలతో బొడ్డెమ్మను వేడుకున్నారు.

ఆలేరుకు నీరివ్వకుండా అన్యాయం

- గత ప్రభుత్వంపై బీర్ల అయిలయ్య ఆగ్రహం

చేర్యాల, సెప్టెంబరు 28: వైఎస్ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం తపాస్‌పల్లి రిజర్వాయర్ నిర్మాణం చేపట్టినప్పటికీ గత బీఆర్ఎస్ సర్కార్ ఆలేరు నియోజకవర్గానికి సాగునీరు ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేసిందని, ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో కొనసాగుతున్న ప్రజాసర్కార్ ద్వారా గోదావరి జలాలతో ఆలేరు చెరువులు నింపి ప్రజల కాళ్లు తడిపేందుకు చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. కొమురవెల్లి మండలం ఐనాపూర్ శివారులోని తపాస్‌పల్లి రిజర్వాయర్‌లో కొద్దిరోజులుగా గోదావరి జలాల పంపింగ్ కొనసాగుతున్న క్రమంలో శనివారం ఆయన సందర్శించారు. రిజర్వాయర్‌లో నీటి నిల్వ పరిశీలించి కుడికాలువ గేట్లు ఎత్తి బచ్చన్నపేట మండలం కొన్నె మీదుగా ఆలేరుకు గోదావరి నీటిమళ్లింపు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన



జర్వాయర్ నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

మాట్లాడుతూ.. తపాస్‌పల్లి రిజర్వాయర్ ద్వారా బచ్చన్నపేట మండలానికి నీళ్లిచ్చిన క్రమంలో అతిచేరువన ఉన్న ఆలేరు నియోజకవర్గ చెరువులు నింపాలని ఎన్నిసార్లు కోరినా, పట్టించుకోకుండా సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు కొండపాక మండలానికి తరలించుకుపోయారని ఆరోపించారు. ఇటీవల మల్లన్నసాగర్ నుంచి ఆలేరు నియోజకవర్గ పరిధిలోని గంధ మాల చెరువులు నింపామని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీమేరకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో దేవాదుల ద్వారా రాజపేట, కొలనుపాక తదితర చెరువులు నింపి ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. అన్నదమ్ముల్లా వ్యవహరిస్తూ అన్ని చెరువులు నింపుకుందామన్నారు.

ఇక్కడి చెరువులను నింపకుండా తరలిస్తే ఊరుకోబోం: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, సెప్టెంబరు 28: కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి రిజర్వాయర్ ప్రతిపాదిత ఆయకట్టు పరిధిలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూళిమిట్ట, జనగామ జిల్లా బచ్చన్నపేట మండలాల చెరువులను గోదావరి జలాలతో నింపిన తరువాతే, ఇతర ప్రాంతాలకు నీటిని తరలించాలని, లేనియెడల సహించబోమని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఫోన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ చీఫ్ విప్ బీర్ల అయిలయ్య తీరును ఖండించారు. ఆలేరు ప్రాంతంలోని చెరువులను నింపడానికి తపాస్‌పల్లి రిజర్వాయర్ సందర్శించి ప్రధాన కాల్వల వద్ద గేట్‌వాల్వ్‌లను కార్యకర్తలతో తెరవడం సరికాదన్నారు. చేర్యాల ప్రాంత రైతాంగం ప్రయోజనాల కోసం నిర్మించిన తపాస్‌పల్లి రిజర్వాయర్ నీటిని గతంలో మాదిరిగా ఈప్రాంతంలోని చెరువులు నింపాకే తరలించుకుంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. సకాలంలో వర్షాలు లేక ఇప్పటికే రైతులు ఇబ్బందులుపడుతున్న క్రమంలో తరలించుకుపోవడం సబబుకాదన్నారు. దేవాదుల అధికారులు తక్షణమే స్పందించి చేర్యాల ప్రాంత చెరువులు నింపాలని, లేనిపక్షంలో రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి గాయాలు

చేర్యాల, సెప్టెంబరు 28: చేర్యాల పట్టణంలోని బాలాజీ కళామందిర్ చౌరస్తా వద్ద డీసీఎం ద్విచక్రవాహనాన్ని ఢీ కొన్న సంఘటనలో స్థానిక వివేకానందపురి కాలనీకి చెందిన బాలుడు శ్రీకర్ తీవ్రగాయాలపాలయ్యాడు. ద్విచక్రవాహనంపై శ్రీకర్ వెళ్తుండగా, వెంకటేశ్వర ఫౌల్ట్రీస్‌కు చెందిన డీసీఎం ఢీకొనడంతో కాలువిరిగి రక్తస్రావమైంది. గమనించిన చుట్టుపక్కలవారు శ్రీకర్‌ను చికిత్స నిమిత్తం సిద్దిపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. స్థానికులు డీసీఎంను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లగా, చిక్స్ ఫీడ్ ఉన్న కారణంగా కొద్దిసేపటికే తీసుకుపోవడం పట్ల అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

కళా మహోత్సవానికి తరలిన విద్యార్థులు



భారతీయ కళా మహోత్సవంలో నవోదయ విద్యార్థులు

వర్గల్, సెప్టెంబరు 28: హైదరాబాద్‌లోని బొల్లారం రాష్ట్రపతి నిలయంలో శనివారం సాయంత్రం నిర్వహించిన భారతీయ కళా మహోత్సవం 2024 కార్యక్రమంలో వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయం విద్యార్థులు పాల్గొన్నారని ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ తెలిపారు. బొల్లారం రాష్ట్రపతి నిలయంలో సాయంత్రం భారతీయ కళా మహోత్సవం కార్యక్రమాన్ని రాష్ట్రపతి ద్రౌపతి ముర్మ ప్రారంభించారని తెలిపారు. ఈ కార్యక్రమాని తమకు ఆహ్వానం పంపిన నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయం ఉప సంచాలకులు గోపాలకృష్ణకు ప్రిన్సిపాల్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులతో పాటు నవోదయ విద్యాలయం తెలుగు అధ్యాపకుడు విజయ్‌కుమార్, ఆంగ్ల అధ్యాపకురాలు సుసాన్‌జాన్ ఉన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- ఎమ్మెల్సీ వంటేరి యాదవరెడ్డి

గజ్వేల్, సెప్టెంబరు 28: చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని ఎమ్మెల్సీ వంటేరి యాదవరెడ్డి సూచించారు. గజ్వేల్ పట్టణంలో శనివారం ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువు, క్రీడలు రెండూ విద్యార్థి జీవితంలో ముఖ్యమైనవేనన్నారు. ఈ క్రీడల్లో మొత్తం 3వేల మంది విద్యార్థులు పాల్గొన్నట్లు ఎస్‌జీఎఫ్ మండల కార్యదర్శి, పీడీ తాళ్ల భవాని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీయోద్దీన్, ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య, ఎంఈవో కృష్ణ ఉన్నారు.

- **ములుగు:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని ఎంఈవో ఉదయ్‌భాస్కర్‌రెడ్డి అన్నారు. తునికిబొల్లారం జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో రెండు రోజులపాటు నిర్వహించిన క్రీడల్లో 14 పాఠశాలలకు చెందిన 400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.



గజ్వేల్: మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

- **వర్గల్:** క్రీడాకారులు నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వేలూర్‌లో వారం రోజుల పాటు నిర్వహించిన బేస్‌బాల్ శిక్షణ శిబిరం ముగింపు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మధుయాదవ్, జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు నిమ్మ రంగారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరి ప్రవీణ్‌గౌడ్, వేలూరు తాజా మాజీ సర్పంచ్ పాపిరెడ్డి, బేస్‌బాల్ అసోసియేషన్ సభ్యులు శ్వేత, కృష్ణ, నాయకులు వెంకటేశ్వర్ గౌడ్, సీనియర్ క్రీడాకారులు నాగరాజు, విఠల్, శ్రీకాంత్, పాల్గొన్నారు.

సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త విజయ్‌కుమార్

గజ్వేల్, సెప్టెంబరు 28: పంటల్లో సస్యరక్షణ చర్యలను చేపట్టాలని తోర్నాల ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త విజయకుమార్ సూచించారు. గజ్వేల్ వ్యవసాయశాఖ ఏడీఏ బాబునాయక్, ఏవో నాగరాజు బృందం గజ్వేల్ మండలంలోని పిడిచెడ్, బయ్యారం, ర్యాగట్లపల్లి గ్రామాల్లో వరి, పత్తి, మొక్కజొన్న, కంది పంటలను శనివారం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు రైతులకు పలు సూచనలు చేశారు. వారివెంట ఏఈవోలు గణేశ్, జ్యోతి, మాధవి, రైతులు పెద్దిరెడ్డి రంగారెడ్డి, మన్నె అశోక్, పిట్ల స్వామి, శ్రవణ్, పవన్‌రెడ్డి పాల్గొన్నారు.

- **జగదేవ్‌పూర్:** పురుగుల మందుల వాడకంలో రైతులు విధిగా జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి వసంతరావు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోతాదుకు మించి, తక్కువగా పురుగుల మందులు వాడకం ప్రమాదకరమని పేర్కొన్నారు. పురుగుమందులు కొనేటప్పుడు విధిగా రసీదు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు పాల్గొన్నారు.
- **కోహెడ:** పంటలకు మందును పిచికారి చేసే సమయంలో నీరు తాగటం, ఆహారం తినటం, పొగాకు నమలడం లాంటివి చేయకూడదని ఏవో సతీష్ సూచించారు. మండలంలోని రైతు వేదికలో పంటలకు వచ్చే చీడ, పీడల నివారణ కోసం వాడే పురుగు మందుల వినియోగం, తీసుకోవాల్సిన మెళుకువలు, జాగ్రత్తలపై రైతులకు వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవోలు శ్రీధర్‌రెడ్డి, ప్రణతి తదితరులు ఉన్నారు.
- **సిద్దిపేట అర్బన్:** సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని ఇమాంబాద్‌లో వ్యవసాయశాఖ అధికారులు పత్తి, ఆయిల్‌పామ్, వరి పంటను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అధికారి శ్రీనాథ్ మాట్లాడారు.



గజ్వేల్: పత్తి పంటను పరిశీలిస్తున్న అధికారులు

భగత్‌సింగ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలి

- నివాళులర్పించిన నాయకులు

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 28: యువత భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని మాజీ ఎంపీటీసీ మంజుల మహేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బిక్షపతి పేర్కొన్నారు. భగత్‌సింగ్ 117వ జయంతి సందర్భంగా మండలంలోని తిగుల్ ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ భూమయ్య, వివిధ పార్టీల నాయకులు బిక్షపతి, లింగం, ఈశ్వర్, సుధాకర్‌రెడ్డి, మహేందర్ రెడ్డి, అంజనేయులు, నిలేష్‌రెడ్డి, సైదయ్య, మల్లారెడ్డి, సిద్దారెడ్డి, కృష్ణమూర్తి, జర్నలిస్టు పరశురాం పాల్గొన్నారు.

- **సిద్దిపేట అర్బన్:** సిద్దిపేటలో ఏఐవీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వేరువేరుగా భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐవీఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నేకుమార్, విద్యార్థి సంఘం నాయకులు రాజు, కృష్ణ, రవి, స్వామి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.
- **మిరుదొడ్డి:** అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లి ప్రాథమిక పాఠశాలలో భగత్‌సింగ్ చిత్రపటానికి టీపీటీఎఫ్ అక్బర్‌పేట-భూంపల్లి మండల అధ్యక్షుడు శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలకృష్ణ, ఎర్త్‌ఫౌండేషన్ సభ్యులు అంజనేయులు, సరిత, నవిత తదితరులున్నారు.



జగదేవ్‌పూర్: తిగుల్‌లో భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

- **గజ్వేల్ రూరల్:** పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు సుద్ద ముక్కలను ఉపయోగించి భగత్‌సింగ్ చిత్రాన్ని చిత్రీకరించారు.

ఎంఈవో బాధ్యతల స్వీకరణ

రాయపోల్, సెప్టెంబరు 28: రాయపోల్ ఎంఈవోగా రాంసాగర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణరెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అందించేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అంజిరెడ్డి, నాగరాజు, హన్మంతరెడ్డి, సీఆర్పీలు పాల్గొన్నారు.

మాదిగ కులసంఘం అధ్యక్షుడిగా ముస్త్యాల నాగేశ్వర్‌రావు

చేర్యాల, సెప్టెంబరు 28: చేర్యాల పట్టణ మాదిగ కులసంఘం అధ్యక్షుడిగా ముస్త్యాల నాగేశ్వర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్‌నగర్ కాలనీలోని రేణుకామాత ఆలయంలో శనివారం సంఘం అధ్యక్ష ఎన్నిక నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మాదిగ కులస్థుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తానన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కోహెడ, సెప్టెంబరు 28: మండలంలో 27 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను తాహసీల్దార్ సురేఖ శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ సురేందర్, కాంగ్రెస్ నాయకులు మంద ధర్మయ్య, దొమ్మట జగన్‌రెడ్డి, శెట్టి సుధాకర్, బందెల బాలకిషన్, ముంజ తిరుపతి తదితరులు ఉన్నారు.

ఉత్తమ సేవలకు అవార్డు

దుబ్బాక, సెప్టెంబరు 28: 108 అంబులెన్స్ విధులను నిర్వర్తిస్తున్న ఎల్లప్పకు ఉత్తమ ఈఎమ్‌టీ అవార్డును అందించారు. దుబ్బాకలోని వందపడకల ఆసుపత్రి ఆవరణలో శనివారం ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ ఉమ్మడి జిల్లా మేనేజర్ జనార్దన్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డును అందజేశారు.

'పోటీతత్వాన్ని అలవరచుకోవాలి'

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 28: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని వ్యాపారవేత్త వంగ రాజేశ్వర్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. నారాయణరావుపేట మండలం జక్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు శనివారం రూ. 1లక్ష విలువగల జిరాక్స్ మిషన్‌ను అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షౌకత్ అలీ, మాజీ సర్పంచ్ పరుశరాములు, మాజీ ఎంపీటీసీ బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కోడి దేవేందర్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ మాట్ల లక్ష్మి, మాజీ ఉపసర్పంచ్ పల్లె కనకంబరం, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ యువత, పాల్గొన్నారు.

30న హుండీ లెక్కింపు

చేర్యాల, సెప్టెంబరు 28: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో ఈనెల 30న కానుకలు, ఒడిబియ్యం, హుండీలను లెక్కించనున్నట్లు ఈవో బాలాజీ శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

తహసీల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జనగామ ఆర్డీవో



మద్దూరు: రికార్డులను తనిఖీ చేస్తున్న ఆర్డీవో

మద్దూరు, సెప్టెంబరు 28: మద్దూరు తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం జనగామ జిల్లా ఆర్డీవో, ఈఆర్‌వో కొమురయ్య ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయానికి చేరుకున్న 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కు కల్పించేందుకు వచ్చిన ఫామ్-6 దరఖాస్తులతో పాటు మరణించిన, గ్రామంలో లేని వారి విషయంలో తీసుకున్న చర్యలపై రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంజీవ్‌కుమార్, ఆర్ఐ రమేష్‌తో పాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- **దూళిమిట్ట:** మండల కేంద్రంతో పాటు, గ్రామాల్లో బూత్ లెవల్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెషల్ సమ్మరీ రివిజన్ కార్యక్రమంపై తహసీల్దార్ కార్యాలయంలో జనగామ ఆర్డీవో దేవరాయ కొమురయ్య సమీక్ష నిర్వహించారు. అనంతరం బైరాన్‌పల్లిలో జరుగుతున్న స్పెషల్ సమ్మరీ రివిజన్ ఓటర్ వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మధుసూదన్, రెవెన్యూ అధికారులు, బూత్‌లెవల్ అధికారులు ఉన్నారు.

ముళ్లపొదల తొలగింపునకు నిధులు..

కోహెడ, సెప్టెంబరు 28: పాఠశాలలో ఆవరణలో ఉన్న చెట్లు, ముళ్లపొదలు తొలగించేందుకు కలెక్టర్‌కు నివేదించి నిధులు మంజూరు చేస్తానని హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి పేర్కొన్నారు. కోహెడ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను శనివారం సందర్శించారు. మధ్యాహ్న భోజనం చేసే గదిని పరిశీలించి పాఠశాలలోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నూతన డార్మెంటరీ కోసం సంబంధిత అధికారులు పిలిపించి ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ సురేఖ, పాఠశాల అధ్యాపకులు ఉన్నారు.

నిందితులను అరెస్టు చేయాలి

- డీబీడీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండ స్వామి

గజ్వేల్ రూరల్, సెప్టెంబరు 28: గౌతోజిగూడలో డప్పు కొట్టడాన్ని నిరాకరించిన దళితులను సాంఘిక బహిష్కరణ చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి డిమాండ్ చేశారు. గౌతోజిగూడలో జిల్లా అధ్యక్షుడు దుబాష్ సంజీవ్, కార్యదర్శి దయాసాగర్, ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణుతో కలిసి శనివారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సాంఘిక బహిష్కరణ గురైన బాధితులకు అండగా, రక్షణ కల్పించాలని అన్నారు.

'ప్రభుత్వాల విధానాలను ఎండగట్టాలి'



మాట్లాడుతున్న మల్లారెడ్డి

చేర్యాల, సెప్టెంబరు 28: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ ప్రజాసమస్యలపై పోరాడాలని సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి పేర్కొన్నారు. చేర్యాల మండలం షబాషీగూడెంలో శనివారం గ్రామశాఖ మహాసభ నిర్వహించారు. అనంతరం గ్రామశాఖ కార్యదర్శిగా దండ్ల రమేశ్, సోషల్‌మీడియా గ్రామ సభ్యుడిగా బొడ్డు ప్రకాశ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాళ్లబండి శశిధర్, కొంగరి వెంకట్‌మావో, మోకు దేవేందర్‌రెడ్డి, నాగపురి కనకయ్య, గొర్రె శ్రీనివాస్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

వెటర్నరీ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబరు 28: జిల్లా వెటర్నరీ అసోసియేషన్ కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా శ్రీకాంత్, కార్యదర్శిగా సయ్యద్ పాషా, అసోసియేట్ అధ్యక్షుడిగా యాదగిరి, ట్రెజరర్‌గా సతీష్‌ను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు, ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ గాదరి పరమేశ్వర్, కార్యదర్శి విక్రమ్ రెడ్డి, రాష్ట్ర వెటర్నరీ సంఘం అధ్యక్షుడు సురేష్, టీఎన్జీవోస్ మహిళా ఉపాధ్యక్షురాలు సుజాత ఉన్నారు.

'పెంపుడు జంతువులకు వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి'



జంతువులకు టీకాలు వేస్తున్న అధికారులు

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబరు 28: పెంపుడు జంతువులకు వచ్చే వ్యాధుల పట్ల యజమానులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్. జగత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సిద్దిపేటలోని ప్రాంతీయ పశు వైద్యశాలలో ఏడీఏ డాక్టర్ సత్యప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రపంచ రేబిస్ దినోత్సవ సందర్భంగా శనివారం పెంపుడు జంతువులకు, వీధి కుక్కలకు టీకాలు వేశారు. అనంతరం ఏబీసీ సెంటర్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ విజయసారథి, రాము, రాజు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ప్రశాస్త్'పై ఉపాధ్యాయులకు అవగాహన

దూళిమిట్ట, సెప్టెంబరు 28: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శనివారం ప్రశాస్త్ కార్యక్రమంపై మండలంలోని పలు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, కోర్సు డైరెక్టర్ కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల సమస్యలను గుర్తించడం ద్వారా ఉన్నతాధికారులు వాటి పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ట్రైనర్ గిరి సురేందర్‌రెడ్డి, పలు ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను 'అంగన్‌వాడీ'కి పంపాలి

- సూపర్‌వైజర్ పుష్పలత



పిల్లలకు ఆటపాటలతో అవగాహన కల్పిస్తున్న పుష్పలత

మద్దూరు, సెప్టెంబరు 28: మూడు నుంచి ఆరు సంవత్సరాల లోపు పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రానికి పంపాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పుష్పలత సూచించారు. మద్దూరు మండల సెక్టార్ నర్సాయపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీఈ డేను పురస్కరించుకుని శనివారం విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రీస్కూల్‌పై ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పుష్పలత మాట్లాడారు. ప్రీస్కూల్‌ను ఆటపాటలతో నిర్వహిస్తామన్నారు. పిల్లల శారీరక, మానసిక అభివృద్ధితో పాటు భాషాభివృద్ధిపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఆర్పీ భార్గవి, అంగన్‌వాడీ టీచర్లు, ప్రీస్కూల్ పిల్లల తల్లిదండ్రులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు. అలాగే రేబర్తి అంగన్‌వాడీ కేంద్రానికి పిల్లలకు బొమ్మల, కథల పుస్తకాలు వచ్చాయి. వీటిని సద్వినియోగం చేసుకోవాలని సెక్రటరీ జాదవ్ మాధవ్ సూచించారు.

మున్సిపల్ సిబ్బందికి దుస్తుల పంపిణీ

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు 28: బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా సిద్దిపేట పట్టణంలోని 23వ వార్డులో కౌన్సిలర్ నాయకం లక్ష్మణ్ శనివారం మున్సిపల్ సిబ్బందికి దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండుగను మున్సిపల్ సిబ్బంది ఆనందంగా జరుపుకోవాలని, కుటుంబసభ్యులతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

'నిర్వాసితులకు ప్యాకేజీలు అందివ్వండి'

ములుగు, సెప్టెంబరు 28: కొండపోచమ్మ ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన నిర్వాసితులకు ప్యాకేజీలు, ఇళ్లస్థలాలు ఇప్పించాలని బైలంపూర్ మాజీ ఎంపీపీ వెంకట్రాంరెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మంత్రి దామోదర్ రాజనర్సింహను శనివారం కలిసి కోరారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ.. కొండపోచమ్మ ప్రాజెక్టు కింద ప్యాకేజీలు, ప్లాట్లు రాని వారి గురించి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయి వచ్చేవిధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

రంగనాయకసాగర్ కాలువలపై సర్వే



బస్వాపూర్‌లో సర్వే చేస్తున్న అధికారులు

కోహెడ, సెప్టెంబరు 28: రంగనాయక సాగర్ ప్రాజెక్టు నుంచి వచ్చే నీటి కోసం కోహెడ మండలంలో ప్రధాన కాలువల నిర్మాణాలకు రెండు రోజులుగా అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వం సర్వే చేసి కాలువల నిర్మాణానికి సిద్ధం చేసినప్పటికీ ప్రభుత్వం మారడంతో పనులు ముందుకు సాగలేదు. మండలంలోని బస్వాపూర్ రెవెన్యూ పరిధిలో 52 ఎకరాలు, గుండారెడ్డిపల్లి పరిధిలో 11 ఎకరాలను సుమారు 60 మంది రైతులు ఈ కాలువ నిర్మాణంలో కోల్పోవుతున్నారు. భూసేకరణ జరిగే ప్రాంతాల్లో పర్యటించి కొలతలు తీసుకొని గుర్తులుపెట్టారు. రెవెన్యూ అధికారులు శ్రీనివాస్, ఆర్ఐ సురేందర్, ఇరిగేషన్ అధికారి రాజు, రైతులు ఉన్నారు.

'శుభ్రమైన తాగునీటిని అందించాలి'

మద్దూరు, సెప్టెంబరు 28: శుభ్రమైన తాగునీటిని అందించాలని సిద్దిపేట జిల్లా మిషన్ భగీరథ ఈఈ సీహెచ్ గిరిధర్ సూచించారు. రైతు వేదికలో గ్రామ మంచినీటి సహాయకులకు ఎంపీడీవో రామ్మోహన్ అధ్యక్షతన నిర్వహించిన శిక్షణ కార్యక్రమం రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ.. మిషన్ భగీరథ, బోరు ద్వారా అందించే నీటిలో నాణ్యత పాటించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఈఈ కృష్ణ, ఏఈ దివ్య, ట్రైనర్ సుజన్‌కుమార్ పాల్గొన్నారు.

- **మిరుదొడ్డి:** గ్రామాల్లో మిషన్‌భగీరథ సరఫరా పైప్‌లైన్లలో లీకేజీలు లేకుండా చూసుకోవాలని మిరుదొడ్డి ఎంపీడీవో గణేష్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, మిషన్‌భగీరథ అధికారులు తదితరులున్నారు.

జీవో 25ను రద్దు చేయాలి

- ఎస్టీజీటీ ఫోరం రాష్ట్ర కోశాధికారి నరసింహచారి

చిన్నకోడూరు, సెప్టెంబరు 28: జీవో నెంబరు 25ను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలో ఒక పీఎస్ హెచ్‌ఎం, తరగతికి ఒక టీచర్‌ను ఇవ్వాలని ఎస్టీజీటీ ఫోరం రాష్ట్ర కోశాధికారి పానుగంటి నరసింహచారి డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు చిన్నకోడూరు హైస్కూల్‌లో సమావేశమై జీవో నెంబరు 25కు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన చేపట్టారు. ఎంఈవోకు వినతిపత్రం అందజేశారు.

- **బెజ్జంకి:** జీవో నెంబర్ 25ను ప్రభుత్వం సవరించి ప్రాథమిక పాఠశాలలకు న్యాయం చేయాలని ఎస్జీటీ ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 25 ను సవరించాలని కోరుతూ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఎస్జీటీ ఉపాధ్యాయులు ఉపాధ్యాయ సంఘాల పిలుపుమేరకు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.
- **మిరుదొడ్డి:** ప్రభుత్వం సర్దుబాటు ఉత్తర్వులను సవరించాలని టీజీయూటీఎఫ్ మిరుదొడ్డి మండల అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణ, బద్దిరాజులు డిమాండ్ చేశారు. ఎంఈవో ప్రవీణ్ బాబును టీజీ యూటీఎఫ్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో టీజీ యూటీఎఫ్ నాయకులు తదితదరులున్నారు.

కార్మికులందరినీ క్రమబద్ధీకరించాలి: సీఐటీయూ

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 28: ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించి కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎల్లయ్య, గోపాలస్వామి డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులతో కలిసి సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. మున్సిపల్, గ్రామపంచాయతీ, ప్రభుత్వ కార్యాలయాల్లో, యూనివర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, జిల్లా కమిటీ సభ్యుడు అమ్ముల బాల్ నర్సయ్య, నాయకులు గుర్రం నరసింహులు, దొబ్బెట రాజయ్య, వినోద, రాజయ్య, కవిత, నరసింహులు, సురేష్, యాదగిరి, రాములు, మల్లేశం, నర్సింహులు, నాగరాజు, నగేష్, కనుకవ్వ, మహలక్ష్మి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'హైడ్రా' పేరు వింటేనే బీఆర్ఎస్ భయపడుతున్నది

- కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్



మాట్లాడుతున్న పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు 28: 'హైడ్రా' పేరు వింటేనే బీఆర్ఎస్ భయపడుతున్నదని కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్దిపేట పట్టణంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ఆర్థిక వనరులను ధ్వంసం చేశారన్నారు. కేసీఆర్ హయాంలో రాష్ట్రంలోని చెరువులు, కుంటలు కబ్జాకు గురయ్యాయని, దీంతో ఆ స్థలాల్లో అపార్ట్‌మెంట్లు, విల్లాలు నిర్మించారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు గ్యాదరి మధు, గయాజుద్దీన్, రాషాద్, అజ్మత్, పయ్యావుల సందీప్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛత హీ సేవ'లో భాగస్వాములు కావాలి

ములుగు, సెప్టెంబరు 28: స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శ్రీనిధి పేర్కొన్నారు. ములుగు మండలం అటవీ కళాశాల, పరిశోధన సంస్థ(ఎఫ్‌సీఆర్ఐ)లో ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ యూనిట్ల ఆధ్వర్యంలో శనివారం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కోఆర్డినేటర్ శాలిని, ముద్దల్కర్ తదితరులు పాల్గొన్నారు.

- **సిద్దిపేట కల్చరల్:** సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం చేపట్టారు. కళాశాల అవరణలోని పిచ్చి మొక్కలను తొలగించి, చెత్తా చెదారం ఏరివేశారు. రెండు రోజులుగా 150 మంది ఎన్‌సీసీ కెడెట్లు శ్రమదానం చేసి పరిసరాలను శుభ్రం చేశారు. మున్సిపల్ శానిటరి ఇన్‌స్పెక్టర్ వనిత, ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ భవాని, సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు స్వచ్ఛ ప్రతిజ్ఞ చేశారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే విద్య లక్ష్యం

- జిల్లా సెక్టోరియల్ అధికారి భాస్కర్

కొండపాక, సెప్టెంబరు 28: సమన్వయం, సహకారం, నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే విద్య అంతిమ లక్ష్యమని జిల్లా సెక్టోరియల్ అధికారి భాస్కర్ పేర్కొన్నారు. కొండపాక బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బి.విఠల్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన నో బ్యాగ్‌డే కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలోని అష్టదిగ్గజ కవుల పాత్రను పోషించి పద్య ధారణలతో భువన విజయం నాటిక ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సముద్రాల శ్రీనివాస్, ఉపాధ్యాయులు రఘువర్ధన్‌రెడ్డి, హారతి, రామస్వామి, మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, కనకయ్య, బాల మల్లయ్య, సత్యలక్ష్మి, రాకేష్, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు మామిడాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

'రక్షణ చట్టాలపై అవగాహన ఉండాలి'

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 28: విద్యార్థులకు మహిళల రక్షణ చట్టాలపై అవగాహన ఉండాలని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను సూచించారు. సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా శనివారం వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి, షీ టీం సిబ్బంది కిషన్, కానిస్టేబుళ్లు మమత వీణాకుమారి, ప్రవీణ్ పాల్గొన్నారు.

- **గజ్వేల్ రూరల్:** విద్యార్థులు డ్రగ్స్ మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని, అప్రమత్తంగా ఉండాలని గజ్వేల్ సీఐ సైదా సూచించారు. గజ్వేల్‌లో సెంట్‌జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ వివిధ అంశాలపై సీఐ సైదా, షీటీం సభ్యులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సుష్మ, అధ్యాపకులు, గజ్వేల్ షీటీం ఏఎస్ఐలు పాల్గొన్నారు.
- **ములుగు:** గ్రామాలలో ప్రతి ఒక్కరూ అన్నదమ్ముల్లా కలిసి ఉండాలని ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని దాసర్లపల్లిలో సివిల్ రైట్స్ సందర్భంగా సమావేశం నిర్వహించారు.